క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం


డాక్టర్ తలే రాజేష్

రాజాం: స్థానిక పట్టణంలోని జీఎంఆర్ ఐటీ పక్కనే ఉన్న ఎస్ఆర్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు హాజరుకానున్నారని తెలిపారు. రాజాం మున్సిపాలిటీతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ అధ్యక్షులు, యూత్ అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలంతా హాజరుకావాలని కోరారు.

పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

సంతకవిటి: మండలంలోని మిర్తివలస గ్రామానికి చెందిన రాజాపు బుజ్జి ఇటీవల మృతి చెందగా, విషయం తెలుసుకున్న జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు సోమవారం ఆ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బుజ్జి మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజాపు రమణ, మాజీ సర్పంచ్‌లు రాజాపు పాపినాయుడు, రాజాపు చిరంజీవి, ఎన్ని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి మండల ఎన్నికల ఇన్‌చార్జ్‌గా శ్రీకాంత్


శంబంగి శ్రీకాంత్


బాడంగి: వైఎస్సార్ సీపీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్‌గా ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కుమారుడు, నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్ నియమితులయ్యారు. ఇదే విషయాన్ని మండల కేంద్రంలో సోమవారం జరిగిన పార్టీ మండల సమావేశంలో ఎమ్మెల్యే స్వయంగా ప్రకటించారు. గత ఎన్నికల సమయంలో రామభద్రపురం మండల ఎన్నికల ఇన్‌చార్జ్‌గా పనిచేసిన ఆయన పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారని, అందుకే ఆయనను బాడంగి ప్రాంతంలో పనిచేయాల్సిందిగా కోరుతున్నట్లు తెలిపారు. త్వరలోనే ఇక్కడ పార్టీ కార్యాలయం ప్రారంభించి, బాధ్యతలు చేపడతారన్నారు.

సజావుగా మండల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గౌరి


బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం సజావుగా జరిగింది. మండల సమగ్రాభివృద్ధికి సభ్యులంతా సహకరించాలని ఎంపీపీ కోరారు. అనంతరం శాఖల వారీగా అభివృద్ధి నివేదికలను అధికారులు చదివి వినిపించగా, పలువురు ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను లేవనెత్తగా, అధికారులు వాటిని పరిష్కరిస్తామని తెలియజేశారు. సమావేశంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, వైస్ ఎంపీపీలు రమేష్, భాస్కరరావు, ఎంపీడీవో ఆంజనేయులు, తహసీల్దార్ రఫీజాన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాలఅన్నమ్మ జాతర


బాలఅన్నమ్మకు పూజలు చేస్తున్న తలే రాజేష్, జగన్మోహనరావు

సంతకవిటి: మండలంలోని సురవరం గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న బాలఅన్నమ్మ పేరంటాలు జాతర మహోత్సవం సోమవారం ముగిసింది. ఉదయం వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి రాజాం, రేగిడి, పొందూరు, జి.సిగడాం మండలాలతో పాటు విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన వేలాదిమంది భక్తులు బారులుతీరారు. సురవరంతో పాటు పరిసర గ్రామాల భక్తులు ఘటాలతో ఆలయానికి చేరుకుని, అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


బొబ్బిలి: చింతాడలో కలశాలలతో మహిళలు


బొబ్బిలి: తారకరామా కాలనీలో జైశ్రీరామ్ అక్షర రూపంలో దీపారాధన


రాజాం సిటీ: పోలిపల్లి పైడితల్లి ఆలయంలో వైఎస్సార్ సీపీ నాయకుల పూజలు


బాడంగి: ట్రాక్టరులో సీతారామలక్ష్మణుల విగ్రహాల ఊరేగింపు

జై శ్రీరామ్!

అయోధ్య రామమందిరంలో సోమవారం బాలరాముని ప్రాణప్రతిష్ఠ పురస్కరించుకుని, రామనామస్మరణ మార్మోగింది. కాషాయ జెండాలు, తోరణాలతో ఆలయ ప్రాంగణాలు, వీధులు మెరిశాయి. ఉదయం నుంచే మందిరాలకు పోటెత్తిన భక్తులు రామనామం జపిస్తూ రాఘవునికి విశేష పూజలు చేశారు. సాయంత్రం ఆర్ఎస్ఎస్(రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్), వీహెచ్‌పీ(విశ్వహిందూ పరిషత్), హిందూ ధర్మ ప్రచార కమిటీలు, సంఘాల ఆధ్వర్యంలో శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులు, సీతారాముని చిత్రపటాలను వీధుల్లో ఊరేగిస్తూ జైశ్రీరామ్ నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో అంతటా ఆధ్యాత్మిక శోభ సంతరించుకోవడం విశేషం.

– సాక్షి నెట్‌వర్క్.


సంతకవిటి: జీఎస్‌పురంలో బాలరాముని వేషధారణలో బాలుడు


బొబ్బిలి: రాజచెరువువలసలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో చిన్నారులు


సంతకవిటి: గుళ్లసీతారామపురంలోని సీతారాముల ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


వంగర: కొప్పరలో కలశాలలతో మహిళల ఊరేగింపు


తెర్లాం: బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా రంగప్పవలసలో ఏర్పాటు చేసిన అన్నదానం


తెర్లాం: జగన్నాథవలసలో భక్తుల బైక్ ర్యాలీ


రాజాంలో బాలరాముని శోభాయాత్ర


రాజాం: కోదండరామస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్ పూజలు


రాజాం సిటీ: లక్ష్మీపురంలో రామనామం జపిస్తూ భక్తుల తిరువీధి

ఓటర్ల తుది జాబితా విడుదల

- బొబ్బిలిలో మొత్తం 2,28,829 మంది ఓటర్లు
- పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లే అధికం

బొబ్బిలి: రాష్ట్రంలో రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ సోమవారం విడుదల చేసింది. ఈ మేరకు బొబ్బిలి నియోజకవర్గంలో మొత్తం 2,28,829 మంది ఓటర్లు ఉన్నట్లు ఆర్‌డీవో ఎ.సాయిశ్రీ, తహసీల్దార్ డోల రాజేశ్వరరావు తెలిపారు. బొబ్బిలిలో 264 పోలింగ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న ఓటర్లలో స్త్రీలు 1,15,791 మంది ఉండగా, పురుషులు 1,13,027 మంది ఉన్నారు. ఇతరులు 11 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కన్నా స్త్రీ ఓటర్లు 2,764 మంది ఉన్నారు. బొబ్బిలి మండలంలో 54,066 మంది, బాడంగి మండలంలో 39,521 మంది, తెర్లాం మండలంలో 49,382 మంది, రామభద్రపురం మండలంలో 37,920 మంది ఓటర్లు ఉన్నారు. ట్రాన్స్‌జెండర్ల ఓటర్లలో బొబ్బిలిలో ఏడుగురు, తెర్లాం, రామభద్రపురంలలో ఇద్దరు చొప్పున ఉన్నారు. గతంలో కన్నా 4,904 మంది ఓటర్లు కొత్తగా చేరారన్నారు.


బొబ్బిలి: ఓటరు జాబితా వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలుపుతున్న ఆర్‌డీవో సాయిశ్రీ, తహసీల్దార్ రాజేశ్వరరావు

రామభద్రపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓటరు జాబితా ప్రదర్శన సోమవారం చేపట్టారు. మండలంలోని పురుష ఓటర్లు కన్నా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని తహసీల్దార్ ఎ.సులోచనరాణి తెలిపారు. మండలంలో మొత్తం 37,920 ఓటర్లు ఉండగా, వీరిలో 18,593 మంది పురుషులు, 19,325 మంది మహిళలు, ఇద్దరు ఇతరులు ఉన్నారు. పురుష ఓటర్ల కన్నా 732 మంది మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారన్నారు.

తెర్లాం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల తుది జాబితాను తహసీల్దార్ బి.రత్నకుమార్ సోమవారం విడుదల చేశారు. అనంతరం ఓటర్ల జాబితాలను బీఎల్‌ఓలకు అందజేసి, అన్ని పోలింగ్ కేంద్రాల్లో వీటిని ప్రదర్శించాలని సూచించారు. ఓటర్ల నుంచి ఫిర్యాదులు వస్తే వాటిని స్వీకరించి, సరిచేయాలన్నారు. మండలంలో 49,382 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 24,709 మంది, మహిళలు 24,673 మంది ఉన్నారన్నారు.

బాడంగి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల తుది జాబితాను తహసీల్దార్ అజురఫీజాన్ సోమవారం ప్రదర్శించారు. మండలంలో మొత్తం 39,521 మంది ఓటర్లుండగా, మహిళా ఓటర్లు 19,778 మంది, పురుష ఓటర్లు 19,743 మంది ఉన్నారు.

రాజాం సిటీ: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 2,24,227 మంది ఓటర్లు ఉన్నారని తహసీల్దార్ ఎస్.కె.రాజు తెలిపారు. సోమవారం ఈ ఓటర్ల తుది జాబితాను తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నమోదైన ఓటర్లలో 1,12,955 మంది పురుషులు, 1,11,253 మంది స్త్రీలు ఉన్నారని, 19 మంది ఇతరులు ఉన్నారన్నారు.


రాజాం సిటీ: ఓటర్ల జాబితా ప్రదర్శిస్తున్న తహసీల్దార్ రాజు


తెర్లాం: తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల తుది జాబితా ప్రదర్శిస్తున్న తహసీల్దార్ రత్నకుమార్


బాడంగి: తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓటరు జాబితా అతికిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సెల్‌టవర్ నిర్మాణం ఆపాలి

రామభద్రపురం: మండల కేంద్రంలోని పొట్టావాని కోనేరు సమీపంలోని ఓ వీధిలో జరుగుతున్న ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఆ వీధికి చెందిన ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై తహసీల్దార్ ఎ.సులోచనరాణిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జనవాసాల మధ్య సెల్‌టవర్ ఏర్పాటు చేస్తే దాని నుంచి విడుదలయ్యే రేడియేషన్‌తో ప్రజలకు పలు అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే టవర్ ఏర్పాటుకు పెద్దగొయ్యి తీశారని, దాని నిండుగా నీరు ఊరిందని, చిన్నపిల్లలు ఎవరైనా అందులో పడిపోయి చనిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆ గోతిని పూడ్చివేయించి, టవర్ నిర్మాణాన్ని కూడా అడ్డుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జి.ప్రసాదరావు, జి.జగ్గారావు, కె.రాము, ఆర్. గౌరి, బి.లక్ష్మి, వి.రామలక్ష్మి, ఎల్. సింహాచలం, బి.రమణమ్మ, బి.చిన్నమ్మలు, జి.రాములమ్మ తదితరులు ఉన్నారు.


తహసీల్దార్ సులోచరాణికి వినతిపత్రం అందజేస్తున్న పొట్టావాని కోనేటి వీధి మహిళలు

ఎన్నికల శంఖారావ సభకు తరలిరండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బాడంగి: విశాఖ జిల్లాలోని భీమిలిలో ఈ నెల 27వ తేదీన జరిగే వైఎస్సార్ సీపీ ఎన్నికల శంఖారావ సభకు తరలిరావాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. స్థానిక ఎంపీపీ చాంబర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు బి.వెంకటనాయుడు అధ్యక్షతన సోమవారం జరిగిన పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సభకు గ్రామాల వారీగా కార్యకర్తలను వచ్చేలా చూడాల్సిన బాధ్యత ఆ గ్రామ నాయకులు తీసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా చేపడుతున్న ఈ సభలో ఈ నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరిగిన మేలును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలు సభలో వివరిస్తారన్నారు. పార్టీకి చెందిన ప్రతీ నాయకుడు, కార్యకర్త, అభిమాని కూడా పార్టీ మరింత బలోపేతానికి, పార్టీకి మరో విజయం అందించేందుకు సైనికుల్లా కృషి చేయాలన్నారు. ఓ వైపు ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరిస్తూనే మరోవైపు టీడీపీ హయాంలో ప్రజలకు జరిగిన అన్యాయం, మోసం వివరించాలన్నారు. మరోసారి తనను, పార్టీని గెలిపించాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, వైస్ ఎంపీపీ బి.రమేష్, పార్టీ మండల యువత అధ్యక్షుడు వి.రమేష్, జేసీఎస్ కన్వీనర్ ఎం.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను అణగదొక్కే వారికి
ఇవే చివరి ఎన్నికలు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: బీసీలను అణగదొక్కే టీడీపీ, బొబ్బిలి రాజులకు ఇవే చివరి ఎన్నికలు కావాలని, వచ్చే ఎన్నికల్లో వారిని చిత్తుగా ఓడించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ మండల ముఖ్య నేతలు, కార్యకర్తలు, అభిమానులతో సోమవారం సమావేశమైన ఆయన బీసీలకు రాజ్యాధికారం కట్టబెట్టిన ఏకైకనాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, పార్టీ పదవులు, మంత్రివర్గంలో కూడా బీసీలకు పెద్దపీట వేశారన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా విశాఖ జిల్లాలోని భీమిలిలో ఈ నెల 27వ తేదీన నిర్వహించే పార్టీ ఎన్నికల శంఖారావ సభకు అందరూ తరలిరావాలని కోరారు. ప్రతీ సచివాలయం పరిధిలో రెండు బస్సుల ద్వారా సభకు జనం వచ్చేలా చూడాలన్నారు. సర్పంచ్‌లకు అధికారాలు ఇవ్వకుండా జన్మభూమి కమిటీలకు అధికారం పెత్తనమిచ్చి, స్థానికసంస్థలను నిర్వీర్యం చేసింది చంద్రబాబేనని విమర్శించారు. 90 శాతం బీసీలున్న బొబ్బిలిలో కాలువలు ఎక్కడున్నాయో తెలియని బేబి నాయన ఇక్కడి కాలువల్లో తుప్పలు పెరిగిపోయాయని అనడం హాస్యాస్పదమన్నారు. రాజుల ట్రాప్‌లో ఎవరూ పడవద్దన్నారు. రాజకీయాల్లో మంచి అవకాశమిచ్చిన వైఎస్సార్ సీపీని రాజులు మోసం చేసి, మంత్రి పదవి కోసం టీడీపీ గూటికి చేరిన విషయం ప్రజలకు ఇంకా మర్చిపోలేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి భారీ విజయం, టీడీపీకి ఘోర ఓటమి తప్పదన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉత్తరావిల్లి అప్పలనాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు, సీనియర్ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నామపు వెంకటేష్, జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

నియోజకవర్గ స్థాయి పోటీల్లోనూ రాణించాలి


వాలీబాల్ క్రీడాకారులకు క్రీడాసామగ్రి అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, ఎంపీడీవో రమామణి

రామభద్రపురం:

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి, నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులకు ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు చేతులమీదుగా సోమవారం క్రీడాసామగ్రి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించి, వారికి ఉజ్వల భవిష్యత్ ఇచ్చేందుకే ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమామణి, ఈవోపీఆర్డీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజాం సిటీ: ప్రజాసంక్షేమం, మహిళల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ కోరారు. సోమవారం స్థానిక బస్టాండ్ ఆవరణలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించి, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలతో కూడిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉజ్వల గ్యాస్, ఉపాధి హామీ, హౌసింగ్ పథకాల ద్వారా ప్రజలకు చేకూరుతున్న లబ్ధిని మున్సిపల్ కమిషనర్ నాగరాజు వివరించారు.

పారదర్శకంగా కులగణన

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో కులగణన పారదర్శకంగా జరుగుతోంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సోమవారం ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ నిబంధనల మేర వివరాలు సేకరించారు. ఈ నెల 28వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని, నిర్దేశిత గడువులోగా ఈ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సర్వే ద్వారా ఆర్థికంగా వెనకబడిన వారికి సంక్షేమ పథకాలు అందజేసి, తద్వారా ఆర్థిక అసమానతలు రూపుమాపి, సామాజిక సమతుల్యతకు ప్రభుత్వం పాటుపడుతుండడం విశేషం.

– సాక్షి నెట్‌వర్క్.


రాజాం: గడిముడిదాంలో కులగణన సర్వేలో నిమగ్నమైన సిబ్బంది


రామభద్రపురం దిగువ హరిజన వీధిలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో రమామణి

సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా మనమంతా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని దోసరి గ్రామంలో సోమవారం పర్యటించిన ఆయన పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, పలు సంఘాల పెద్దలు, రిటైర్డ్ ఉద్యోగులను కలిసి కాసేపు మాట్లాడారు. తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీకి ఏకపక్షంగా ఓట్లు పడేలా చూడాలన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో ప్రతీ ఇంటికి ప్రభుత్వం చేసిన మేలును పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు వివరించి, తద్వారా పార్టీ విజయానికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


దోసరిలో పార్టీ నేతలు, గ్రామపెద్దలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

విధుల్లోకి అంగన్‌వాడీలు


రామభద్రపురం: కొట్టక్కి-5 అంగన్‌వాడీ కేంద్రంలో విధుల్లో అంగన్‌వాడీ కార్యకర్త

రామభద్రపురం: మండలంలోని 62 అంగన్‌వాడీ కేంద్రాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విధుల్లో చేరినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి.సూర్యకుమారి, పి.కృష్ణకుమారి, రత్నకుమారి తెలిపారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రొంపల్లి-1, రామభద్రపురం-6 కేంద్రాల ఆయాలు మాత్రమే విధుల్లో చేరారని, కార్యకర్తలు విధులకు రాలేదని పేర్కొన్నారు.


తెర్లాంలోని అంగన్‌వాడీ కేంద్రం-5 సందర్శనలో సచివాలయ సిబ్బంది

తెర్లాం: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-5ను సచివాలయ ఉద్యోగులు సోమవారం తనిఖీ చేశారు. పిల్లల హాజరు, పౌష్టికాహారం, స్టాక్‌ను పరిశీలించి, పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పించాలని, ప్రతిరోజూ మెనూ ప్రకారం పౌష్టికాహారం వారికి అందేలా చూడాలని అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవికి తెలిపారు.